26వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాం

- సమస్యలు పరిష్కరిస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం
- మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూలై 10: నాలుగున్నరేళ్ల తమ పాలకవర్గ పాలనలో కరీంనగర్ అభివృద్ధిలో చాలా మార్పులు తీసుకువచ్చామని, సుందర నగరంగా తీర్చిదిద్దామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం 26వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ నక్క పద్మా కృష్ణతో కలిసి రూ.6 లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, నగర అభివృద్దే లక్ష్యంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదన్నారు. నగర వ్యాప్తంగా డివిజన్ల ప్రజలు పాలకవర్గ సభ్యుల ద్వారా తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, తాగునీటితో పాటు పారిశుధ్యాన్ని కూడా మెరుగు పరిచామని తెలిపారు. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది మళ్లీ ప్రజల ఆశీర్వాదం కోసం పాలకవర్గం వెళ్తుందని తెలిపారు. నగరపాలక సంస్థలో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లు పూర్తిగా చెడిపోయాయని, కొత్త వాహనాలు, జెట్టింగ్ యంత్రాల కొనుగోలుకు ప్రతిపాదనలు చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో ఓపెన్ స్థలాల యజమానులు తమ ప్లాట్లను పరిశుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. నగరాభివృద్ధిలో భాగంగా కిసాన్‌నగర్ ప్రాంతంలో ఇప్పటి వరకు చాలా అభివృద్ధి పనులు చేశామని, తాజాగా కార్పొరేటర్ వినతి మేరకు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్, డీఈ అయూబ్, స్థానిక డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు కుతాడి కనకయ్య, పక్కన అతడి భార్య సరిత, ఐద్వా నాయకులు

దొంగతనానికి నాకు ఏం సంబంధంలేదు

- రామడుగు ఎస్ఐ నుంచి నాకు ప్రాణహాని ఉంది
- నాపై తప్పుడు కేసు పెట్టి చిత్రహింసలు పెడుతున్నడు
- ఒప్పుకోకుంటే చంపుతానని బెదిరిస్తున్నడు
- ప్రెస్‌భవన్‌లో బాధితుడు కుతాడి కనకయ్య ఆవేదన
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

తెలంగాణచౌక్, జూలై 10: 'గొర్రెల దొంగతనానికి నాకు ఏ సంబంధం లేదు. అయినా రామడుగు ఎస్ఐ మామిడాల సురేందర్ నాపై తప్పుడు కేసు పెట్టి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి చిత్రహింసలు పెడుతుండు. చంపుతానని బెదిరిస్తున్నడు. ఆయన నుంచి నాకు ప్రాణహాని ఉన్నది. నన్ను కాపాడండి' అని ఉన్నతాధికారులను రామడుగు మండలం వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య వేడుకున్నాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్, భార్య సరితతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనకయ్య మాట్లాడాడు. గొర్రెల దొంగతనం చేశానని రామడుగు పోలీసులు జూన్ 11న తెల్లవారుజామున 4గంటలకు తన ఇంటికి వచ్చి, నిద్రిస్తున్న తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని ఆరోపించాడు. ఆ తర్వాత కరీంనగర్‌కు తీసుకెళ్లారని, ఆ మరుసటి రోజు కూడా కొట్టి రాత్రి 10గంటలకు ఇంటికి పంపించారని వాపోయాడు. మళ్లీ 25న రామడుగు పోలీస్‌స్టేషన్‌కు పిలిచి సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు గొర్రెల దొంగతనాన్ని ఒప్పుకోవాలని.. లేకపోతే చంపేస్తామంటూ బెదిరించి కొట్టారని ఆవేదన చెందాడు. పోలీసులు చిత్రహింసలకు గురి చేయడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యానని, ప్రస్తుతం ఏ పని చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. దొంగతనానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, పిల్లల మీద ప్రమాణం చేస్తున్నట్టు తెలిపాడు. అకారణంగా వేధించిన ఎస్ఐ సురేందర్‌పై చర్యలు తీసుకొని, తన పిల్లల పోషణకు ఆర్థిక సాయం అందించాలని కుతాడి కనకయ్య ప్రభుత్వాన్ని కోరాడు.

బల్దియా అంతర్గత బదిలీల్లో రోజుకో ఉత్తర్వు

- ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ట్రాన్స్‌ఫర్స్‌లో గంటల వ్యవధిలో మార్పులు
- తాజాగా డీబీ సెక్షన్‌కు లీకేజీ కార్మికుల కేటాయింపు
- వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పేర్కొనడంపై విమర్శలు

కార్పొరేషన్, జూలై 10: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది బదిలీ ఓ ప్రవాసనంగా మారుతున్నది. సిబ్బంది బదిలీలకు సంబంధించి ఆర్డర్స్ వచ్చిన 24 గంటల వ్యవధిలో మార్పులు చేస్తూ మరో ఆర్డర్స్ రావడం బల్దియాలో చర్చకు దారి తీస్తున్నది. మొదటగా కంప్యూటర్ ఆపరేటర్లకు సంబంధించి బదిలీ ఉత్తర్వులు జారీ చేయగా, నాలుగు రోజులకే వాటిలో మార్పులు చేస్తూ మరోసారి ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కూడా బదిలీ చేయగా దానిపై కూడా వివాదం నడిచింది. అలాగే ఈ నెల 8న 25 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. 24 గంటలు గడవకముందే మరోసారి ఈ నెల 9న 27 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రెండో ఉత్తర్వులో ఇన్‌స్పెక్టర్ల సంఖ్య పెరుగగా ఉన్నతాధికారులు మొదటగా చేపట్టిన బదిలీల్లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయకూడదని వదిలేశారా... లేక ఇంజినీరింగ్ అధికారులు వారి సమాచారం ఇవ్వలేదా అన్న చర్చ సాగుతున్నది. కాగా, ఈ బదిలీల్లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు తొమ్మిదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్నా వారిని మాత్రం మార్పు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మొదటి ఉత్తర్వుల్లో ఈ ఇద్దరి స్థానాలను మార్చిన ఉన్నతాధికారులు రెండో ఉత్తర్వులో మాత్రం యథాస్థానంలో కొనసాగించడం ఏమిటన్న వాదనలు మొదలయ్యాయి.

డీబీ సెక్షన్‌కు లీకేజీ కార్మికులు

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నగరపాలక సంస్థకు 25 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారు. కాగా, తమ అవసరాల కోసం ముగ్గురు లీకేజీ కార్మికులను అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ పనులకు వినియోగిస్తున్నారు. ఇప్పుడు వారందరినీ కలిపి బదిలీ చేశారు. దీంతో లీకేజీ కార్మికులను కూడా వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా గుర్తించినట్లేనా అన్న చర్చ మొదలైంది. దీంతోపాటు బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు ఇచ్చిన 24 గంటల్లో మళ్లీ మార్పులు చేస్తుండడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు మరింతగా దృష్టి సారించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు పాలకవర్గ సభ్యులు కోరుతున్నారు.

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTE REDRESSAL COMMISSION AT ADILABAD TELANGANA
C.C. No. 200 OF 2023
Between:
Preterm Male (Deceased),
Rep by Mother, Mrs. Alam Nagalaxmi,
...Plaintiff/Complainant
AND
Sri Mahalaxmi Children Hospital
...Defendants/Opposite Parties
NOTICE
To,
1. Dr.S.M. DEVARA, MD.
Microbiology,
(Acclin Path Labs (152683)
C/o. STAR WOMEN & CHILDREN HOSPITAL,
Railway Station Road, Saraswati Nagar,
Karimnagar, Telangana State-505007.
Please take notice that, the above said plaintiff/complainant filed the above complaint against you before the Hon'ble District Consumer Dispute Redressal Commission, Adilabad District at Adilabad vide C.C. No. 200 of 2023 for compensation of death of a preterm Male child and the same is posted for hearing for your appearance on 11-07-2024 at 10:30AM. The Hon'ble court was pleased to direct Plaintiff to serve the notice by way of publication to Defendant No.5. As per the order of the Hon'ble court Defendants is herby directed to appear in person before. Hence you are hereby informed to appear before the above said court on 11-07-2024 at 10.30 A.M., in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.
(By order of the Court)
Sd/- NAGESHWAR RAO PUJARI
Advocate
#406, 4th Floor, Riviera Apartments,
Dwarakapuri Colony, Punjagutta,
Landmark Near Unlon/Federal Bank
Hyderabad-82.
Email: contact@dishalawfirm.com

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఆపరేషన్ ముస్కాన్ పకడ్బందీగా చేపట్టాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

ఆపరేషన్ ముస్కాన్ గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కలెక్టరేట్, జూలై 10: బాలకార్మికులను పనిలో పెట్టుకునే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 31 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ, పోలీసు, కార్మిక శాఖల అధికారులు పాల్గొని కార్ఖానాలు, బట్టల దుకాణాలు, హోటళ్లు, ఇతర షాపులు తనిఖీ చేయాలని సూచించారు. ఇంటి నుంచి తప్పిపోయిన, పారిపోయి వచ్చి రహదారులు, బస్టాండుల్లో భిక్షాటన చేసే 14 ఏళ్ల లోపు చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. బాల కార్మికులు కొనసాగే పరిశ్రమలు, షాపింగ్ మాల్స్ యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. బాలకార్మికుల వివరాలు అందించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఫోన్ నంబర్ ఏర్పాటు చేయాలని, దీనిపై విస్తృత స్థాయి ప్రచారం కల్పించాలని ఆదేశించారు. చిన్నారులు పనిలో కాదు.. బడిలో ఉండాలంటూ వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో ఎంతమంది చిన్నారులను గుర్తించారు, వారి సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు, కేసుల నమోదు, తదితర వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులు ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శామ్యూల్, బీసీడీవో అనిల్‌ప్రకాశ్, డీసీపీవో శాంత, డీఐవో సాజిదా హత హరి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సీడబ్ల్యూసీ సభ్యుడు కళింగ శేఖర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టరేట్ వెనుక భాగంలో గల ఈవీఎంల గోదాంను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను పర్యవేక్షించారు. వాటిని భద్రపరిచిన విధానం, వివరాలు అధికారులనడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, అర్బన్ తహసీల్దార్ రమేశ్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు జాగిరం శ్రీకాంత్, సత్తినేని శ్రీనివాస్, కళ్యాడపు ఆగయ్య, నాంపల్లి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చిగురుమామిడి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

తిమ్మాపూర్/ మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి, జూలై 10: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశ వ్యాప్తంగా ఆశ కార్యకర్తల కోర్కెల దినం సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల తహసీల్ కార్యాలయాల ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. కనీస వేతనం రూ. 26 వేలకు పెంచడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని ఆయా మండలాల తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. చిగురుమామిడిలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్నేళ్ల శ్రీలత, మండలాధ్యక్షురాలు నాగెల్లి పద్మ, బండారి సరోజన, అంజలి, పుష్ప, మంజుల, శ్వేత, సంధ్య, కమల, సాహిదా బేగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్షలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు నాయిని రజిత, నాయకులు కాలువ సురేశ్ యాదవ్, వెంకటలక్ష్మి, జ్యోతి, అనిత, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మానకొండూర్ తహసీల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ నేత సుంకరి సంపత్, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఏ లక్ష్మి, నాయకురాళ్లు కె. వనిత, కె. రోజా, బి.మౌనిక, బి. పద్మ, ఆర్. కనకతార, ఏ భాగ్య, డి. రోజా, అంజలి, స్వరూప పాల్గొన్నారు.

దత్తత పత్రాల పంపిణీ

కలెక్టరేట్, జూలై 10 : నగరంలోని శిశు గృహలో ఆశ్రయం పొందుతున్న ముగ్గురు పిల్లలను సంతానం లేని దంపతులు దత్తత తీసుకోగా, బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా పత్రాలను వారు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పిల్లల సంరక్షణపై దంపతులు అత్యంత శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, ప్రొటెక్షన్ అధికారి తిరుపతి, డీసీపీవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ప్లీడర్ల నియామకం

కోర్టుచౌరస్తా, జూలై 10 : జిల్లా కేంద్రంలోని కోర్టుకు సంబంధించి నలుగురు గవర్నమెంట్ ప్లీడర్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా కే శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు (ఏజీపీ)లుగా గుర్రం శ్రీనివాస్, లక్ష్మణ్, కూర శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. వీరు ఈ పదవుల్లో ఆరు నెలలు కొనసాగనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియామకమైన గవర్నమెంట్ ప్లీడర్లను కొత్త ప్రభుత్వం తొలగించగా వారి స్థానాల్లో ఈ నియామకాలు జరిపారు.

జ్యోతిష్మతిలో 'పైథాన్'పై ప్రత్యేక శిక్షణ

తిమ్మాపూర్ రూరల్, జూలై 10: మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) టెక్నికల్ అసోసియేట్ ట్రైనర్ రత్నప్రియ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పైథాన్ ప్రోగ్రాంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు మాట్లాడుతూ, ఈ ప్రోగ్రాంలో బయట శిక్షణ తీసుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని భావించి, టాస్క్‌లో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగావకాశాలు మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, విభాగాధిపతి డాక్టర్ జగదీశన్, కోఆర్డినేటర్ ఆర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి

వీణవంక, జూలై 10: కార్మికులకు కనీస వేతనం అందజేయాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ దాసారపు వెంకటేశ్, నాయకులు కండె సదయ్య, దాసారపు శ్రీనివాస్, మల్లయ్య, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, జూలై 10 : కొత్తపల్లి పట్టణ పరిధిలోని బీడీ కార్మికులు తమ పిల్లల చదువుల కోసం 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని పట్టణ కార్మికశాఖ సంక్షేమ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీ అనూషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 040-29561297 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మోసం చేసిన ఒకరికి ఎనిమిది నెలల జైలు

చిగురుమామిడి, జూలై 10: కొండాపూర్ గ్రామంలో నివసిస్తున్న ఓ ఒంటరి మహిళ వద్దకు వెళ్లి గ్యాస్ కనెక్షన్ ఇప్పిస్తానని ఆమె బంగారు కమ్మలు తీసుకెళ్లి మోసం చేసిన పర్వతం రాజుపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ బండి రాజేశ్ బుధవారం తెలిపారు. నిందితుడికి ఎనిమిది నెలల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని ఎస్ఐ చెప్పారు.

పారమిత ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ కెడెట్ల ఎంపికలు

కెడెట్ల ఎంపికలు చేపడుతున్న బెటాలియన్ అధికారులు

కొత్తపల్లి, జూలై 10 : స్థానిక పారమిత ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ కెడెట్ల ఎంపికలు నిర్వహించారు. 9వ తెలంగాణ బెటాలియన్ సుబేధార్ జె. సూర్య ప్రసాద్, హవల్దార్ దినకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రశాంత్, ఎక్స్ సర్వీస్ మెన్ రమేశ్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులను శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా కెడెట్లుగా ఈ ఎంపిక చేశారని హెచ్ఎం బాలాజీ తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, దేశ సేవ కోసం వారిని సిద్ధం చేసేందుకు ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ కెడెట్ల ఎంపికలు చేపడుతున్నట్లు పాఠశాలల అధినేత డా. ఈ ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, రమణ, యూపీఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న మేకల వధశాల బహిరంగ వేలం

కార్పొరేషన్, జూలై 10: కరీంనగర్ నగరపాలక సంస్థలోని మేకలు, గొర్రెల వధశాలను ఈ నెల 15న సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్వో ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

వన మహోత్సవం

రుక్మాపూర్ గ్రామంలో మొక్క నాటుతున్న అధికారులు

చొప్పదండి, జూలై 10: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మొక్కలు నాటారు. రుక్మాపూర్, కాట్నపల్లి, సాంబయ్య పల్లి, గుమ్లాపూర్, కొలిమికుంట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జయశంకర్ పాల్గొని మాట్లాడుతూ, మండలంలో 50వేల మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, ఎంపీవో రాజగోపాల్, ఏపీఎం నర్మద, డాక్టర్ శైలేందర్, ఏపీవో రాజు, టెక్నికల్ అసిస్టెంట్ జగదీశ్, ఐకేపీ సీసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మహితాబ్, నాగరాజు, స్వరూప, అక్షిత, సంబంధిత గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన

కమాన్‌చౌరస్తా, జూలై 10: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ ఉపేందర్ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలకు చదువు చెప్పిస్తున్నారని, విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యాసంస్థల చైర్మన్ డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ ఒక మహమ్మారి అని, దాని జోలికి వెళ్లకుండా ఉండడమే మంచిదన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో త్రీ టౌన్ సీఐ జాన్ రెడ్డి, అల్ఫోర్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

బేతిగల్‌లో..

వీణవంక, జూలై 10: బేతిగల్ గ్రామంలో బుధవారం ఎస్ఐ తోట తిరుపతి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన సీఐ కిశోర్.. గంజాయికి బానిసైన వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను వివరించారు. అలాంటి వ్యక్తులు ఎక్కడైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో..

తిమ్మాపూర్, జూలై 10: అలుగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, యువత వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ బాబా ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు భారతి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, జూలై 10 : ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్ అండ్ సైన్స్ పోటీ పరీక్షల్లో సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీలో 6, 7, 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఏ రిషిత, ఏ శ్రీవిద్య, జే సహస్ర, కే హర్షద్, కే సాత్విక్ రెడ్డి బహుమతులు, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులందరినీ ఆయన అభినందించారు.

పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కమాన్‌చౌరస్తా, జూలై 10 : కార్ఖానాగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రమోషన్, బదిలీపై వెళ్లిన 18 మంది ఉపాధ్యాయులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణాచారి పాఠశాలకు వారు అందించిన సేవలను ప్రశంసించారు.

బీఆర్ఎస్ నాయకుడికి వీర్ల పరామర్శ

రామడుగు, జూలై 10 : వెలిచాల పరిధిలోని గుడ్డేలుగులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉప్పు తిరుపతి మాతృమూర్తి వీరమ్మ ఇటీవల మృతిచెందగా, బుధవారం కుటుంబ సభ్యులను రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, మాజీ ఉప సర్పంచ్ పూదరి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మహిళలపై వేధింపులను అరికట్టాలి

తెలంగాణచౌక్, జూలై 10: దేశంలో మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నేరాలకు పాల్పడిన నిందితులకు శిక్షపడేలా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని కోరారు. మహిళల్లో చైతన్యం కోసం తాము సభలు, సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమ హక్కులను పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు పాటించని మటన్ షాపులకు జరిమానా

కార్పొరేషన్, జూలై 10: నగరంలోని పలు ప్రాంతాల్లోని మటన్ షాపుల్లో నగరపాలక సంస్థ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తమ షాపుల్లోనే మేకలు, గొర్రెలను వధిస్తున్న వారిని గుర్తించి రూ.23 వేల మేరకు జరిమానాలు విధించారు. మటన్ షాపు నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగం అధికారులు వెంకన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కమాన్‌చౌరస్తా, జూలై 10 : డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏవో సుధాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ స్పందించి విద్యార్థులకు పూర్తిస్థాయి స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. అలాగే విద్యార్థులను సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న డిగ్రీ కాలేజీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అఖిల్, మల్లికార్జున్, తిరుపతి, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు అరికట్టాలని వినతి

హుజూరాబాద్ రూరల్, జూలై 10: భ్రూణ హత్యలు చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌ను సీజ్ చేయాలని, వాటికి సహకరిస్తున్న డాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని యువజన కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ చందుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ, హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రాలుగా భ్రూణ హత్యలు పెరిగాయని, వాటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు జంగ అనిల్, ఇప్పలపల్లి చంద్రశేఖర్, చల్లూరి విష్ణువర్ధన్, బీట్ల సాయి తేజ, కొండ్ర నాగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి

మానకొండూర్, జూలై 10: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం మానకొండూర్‌లో చోటుచేసుకుంది. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మహంకాళీ వీధికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) కూలి పనిచేసుకుంటు జీవిస్తున్నాడు. ఉదయం 9 గంటలకు బహిర్భుమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న అతడిని కరీంనగర్- జమ్మికుంట రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలై రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. హన్మంతు చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

రాంనగర్, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు 20 ఏళ్ల క్రితం సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని యజమాని దగ్గరికి వెళ్లగా అతడు దూషించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు వివరాలు.. ఇరుకుల్లకు చెందిన బుర్ర లక్ష్మయ్య(60) 2002లో అదే గ్రామానికి చెందిన బుర్ర ఓదయ్య వద్ద నాలుగు గుంటల భూమి కొనుగోలు చేశాడు. సాదా బైనామా రాసుకున్న లక్ష్మయ్య రిజిస్ట్రేషన్ చేయాలని ఓదయ్య దగ్గరకు వెళ్లగా కొంతకాలం కాలయాపన చేస్తూ వచ్చాడు. తర్వాత కాలంలో లక్ష్మయ్య భార్య అనారోగ్యంతో చనిపోగా, ఆర్థిక పరిస్థితులు సరిగా లేక భూమి అమ్ముకుంటానని చెప్పినా రిజిస్ట్రేషన్ చేయలేదు. 15 రోజుల క్రితం భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓదయ్య దగ్గరికి వెళ్లగా రూ.రెండు లక్షలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో రూ.లక్ష ఇస్తానని లక్ష్మయ్య ప్రాధేయపడ్డాడు. అయినా కనికరించని బుర్ర ఓదయ్య దూషించి పంపించడంతో మనస్తాపానికి గురైన లక్ష్మయ్య మంగళవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మయ్య కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

మత్స్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, జూలై10: నగరంలోని గంగ పుత్ర సంఘంలో బుధవారం జాతీయ మత్స్య కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గంగ పుత్రులను బీసీ ఏ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి కోటేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు నాగుల కనకయ్య, రమేశ్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కార్పొరేషన్, జూలై 10: నగరంలోని గంజి ప్రాంతంలో బుధవారం సాయంత్రం వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో శ్రీమాన్ అనే బాలుడు గాయాల పాలయ్యాడు. రోడ్డుపై ఆడుకుంటున్న అతడిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయగా స్థానికులు అడ్డుకున్నారు. అప్పటికే బాలుడికి కాలు, చేతులపై గాయాలయ్యాయి. ఇదే ప్రాంతంలో మరో ముగ్గురిపై కూడా వీధికుక్కలు దాడి చేశాయని స్థానిక నాయకుడు సోహన్ సింగ్ తెలిపారు.

వాహన డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం, జూన్ 10: వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, డ్రైవర్లు వాహనాలను నడిపేటప్పుడు తగిన భద్రతా చర్యలను పాటించాలని కోరారు. ఎన్‌హెచ్ రహదారి టిప్పర్ల డ్రైవర్లకు రోడ్డు నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జాగ్రత్తలు వివరించాలని చెప్పారు. వారిని నిత్యం బ్రీత్ అనలైజర్లతో పరీక్షించాలన్నారు. స్కూల్ బస్ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. నూతన ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.